## క్లుప్తంగా

### నగరపాలక సంస్థ షాపులకు బహిరంగ వేలం



నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన షాపుల లీజు హక్కుల వేలం మంగళవారం నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నిర్వహించారు. డీసీ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన నాజ్ సెంటర్ కాంప్లెక్స్, శ్రీనాథ పీఠం, ఎల్ ఎల్ఆర్, గన్ హాల్, పాత గుంటూరు కూరగాయల మార్కెట్, బీఆర్ స్టేడియం, బీఆర్ స్టేడియం(ఎఫ్ఎఫ్), అడవి తక్కెళ్లపాడు కాంప్లెక్స్‌ల్లో టెండర్ నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీనాథ పీఠం, బీఆర్ స్టేడియం(ఎఫ్ఎఫ్), అడవి తక్కెళ్లపాడు కాంప్లెక్స్‌ల టెండర్లకు ఎవరూ పాల్గొనలేదని తెలిపారు. టెండర్లలో పాల్గొని, అధిక బిడ్ దాఖలు చేసిన వాటి ఆమోదం కోసం కమిషనర్‌కు, స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మదన్ గోపాల్, రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల కోత ఉంటుందని చెప్పారు. ఎస్‌వీఎన్ కాలనీ, తారకరామనగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పాదర్తి రమేష్‌కు నివాళి



పట్నంబజారు: సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చలేని గొప్ప మనిషి పాదర్తి రమేష్‌గాంధీ అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా పనిచేసి మృతి చెందిన పాదర్తి రమేష్‌గాంధీ జయంతి మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఎలుకల మందు తిని యువకుడు మృతి



సాయి సందీప్

లక్ష్మీపురం: ప్రేమ విషయంలో ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు వసంతరాయపురానికి చెందిన భీమవరపు సాయి సందీప్(25) తల్లిదండ్రులు అనారోగ్య కారణంగా మృతి చెందారు. అయితే మృతుడు సాయి సందీప్ వసంతరాయపురంలోని మేనత్త ఈశ్వరి వద్ద ఉంటూ బిగ్ బాస్కెట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల సందీప్ ఓ యువతికి మధ్య ఉన్న ప్రేమ వ్యవహారం కారణంగా ఈనెల 13వ తేదీన ఎలుకల మంది తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసుల మృతుడి వివరాలను సేకరించి మృతుడు బాబాయ్ భీమవరపు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రిలోని పోస్టుమార్టంకు తరలించారు.

### ఓటర్ల జాబితాపై సుప్రీంకోర్టు ఆదేశాలు హర్షణీయం

లక్ష్మీపురం: నవంబర్ నెలలో ఎన్నికలు జరగనున్న బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఆధార్, ఓటర్ కార్డు, రేషన్ కార్డులను పరిగణలోకి తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడం స్వాగతించదగిన విషయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు జాబితా విషయంలో సుప్రీంతీర్పుపై మంగళవారం చర్చ నిర్వహించారు.

**స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన**

ప్రతి ఇంటికి, వ్యాపార సంస్థకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అదానీ మనుషులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి అవగాహన సంస్థ మద్దతుగా నిలుస్తుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వాణిజ్య వ్యాపార సముదాయాల్లో బిగించిన లక్షలాది స్మార్ట్ మీటర్లు అధిక బిల్లులతో వ్యాపారస్తుల నడ్డి విరుస్తున్నాయని తెలిపారు.

# అంతా మా ఇష్టం..!

- డీఎంహెచ్ఓ కార్యాలయంలో 19 ఏళ్లుగా ఓ ఉద్యోగి తిష్ట
- నిబంధనలకు విరుద్ధంగా సదరు ఉద్యోగి కొనసాగింపు
- పలు రిక్రూట్‌మెంట్‌లలో చేతివాటం ఆరోపణలు
- ఇటీవల ఏఎన్ఎం కౌన్సెలింగ్‌లో అభ్యర్థి నుంచి రూ.30 వేలు వసూలు



కౌన్సెలింగ్ రద్దు చేయాలంటూ రాత్రి సమయంలో డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ఏఎన్ఎంలు (ఫైల్)

గుంటూరు మెడికల్: అంతా మాఇష్టం.. ఎడాపెడా ఏది చేసినా అడిడేవరు .. అంటూ డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిబంధనలను అతిక్రమించి 19 ఏళ్లుగా ఓ ఉద్యోగిని కార్యాలయంలోనే కొనసాగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. జూన్‌లో నిర్వహించిన సాధారణ బదిలీల్లో యూనియన్ల నాయకులను దీర్ఘకాలంగా పనిచేస్తుంటే ప్రభుత్వ బదిలీల నిబంధనల ప్రకారం నగరంలోని ఒక యూనిట్ నుంచి మరో యూనిట్‌కు బదిలీ చేశారు. కాని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి 19 ఏళ్లుగా పనిచేస్తున్నా సదరు ఉద్యోగికి ఎలాంటి బదిలీ లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అంతా తానై..**

డీఎంహెచ్ఓ కార్యాలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న పనితీరుపై పలువురు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. సదరు ఉద్యోగి చేస్తున్న పనికి కార్యాలయ అధికారులందరూ ముక్కున వేలేసుకుని చూస్తూ ఉండటమే తప్ప, ఏమీ చేయలేకపోతున్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో కీలక అధికారి, సదరు ఉద్యోగి చెబితేనే సంతకాలు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ముఖ్యమైన అధికారి సంతకం కావాలంటే ముందు సదరు ఉద్యోగిని లక్ష్మీప్రసన్నం చేసుకుంటే తప్ప ఫైల్ ముందుకు నడవదని కార్యాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ముఖ్య అధికారికి నమ్మిన బంటులా సదరు ఉద్యోగి ఉంటూ ఎప్పుడూ కార్యాలయంలోపలే ఉంటూ తనను ప్రసన్నం చేసుకున్నవారి ఫైల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించి త్వరగా క్లియర్ చేస్తున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ముఖ్య అధికారిని కలవాలన్నా ముందు సదరు ఉద్యోగి అనుమతి తీసుకోవాలని కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు.

**ఏఎన్ఎంల బదిలీల్లో..**

ఇటీవల కాలంలో నిర్వహించిన ఏఎన్ఎంల సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో సదరు ఉద్యోగి ఒక్కొక్కరి వద్ద రూ.30 వేలు మామూళ్లు తీసుకుని వారికి నచ్చిన ప్రాంతాల్లో బదిలీ పోస్టింగ్ వేయించారనే ఆరోపణలు వచ్చాయి. తీవ్రమైన ఆరోపణలు రావడంతో కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, మళ్లీ బదిలీ కౌన్సెలింగ్‌ను మూడు రోజుల క్రితం నిర్వహించారు. అయితే కొన్ని ఖాళీలు ఉన్నాయని, వాటిల్లో నచ్చిన ప్రాంతాన్ని కోరుకున్నవారికి వేయిస్తామని సదరు ఉద్యోగి మళ్లీ మామూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ చేయిస్తామని పలువురు అభ్యర్థులకు హామీలు ఇవ్వడంతో సోమవారం పలువురు ఏఎన్ఎంలు కార్యాలయంలో పడిగాపులు కాశారు. మంగళవారం ఉన్నతాధికారి వద్దకు అభ్యర్థులను తీసుకెళ్లి మళ్లీ బదిలీ ప్రక్రియ చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, కార్యాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఏఎన్ఎం బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ వలన అబాసుపాలైన డీఎంహెచ్ఓ కార్యాలయం పరువును మరలా రోడ్డున పడేయకుండా ఉండాలంటే ఇలాంటి అక్రమ బదిలీలు చేయకుండా నిలువరించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

## ఆప్కాస్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



నెహ్రూనగర్: ఆప్కాస్ ఉద్యోగుల సమ్మె కారణంగా నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకూడదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం తక్కెళ్లపాడులోని హెడ్ వాటర్ వర్క్సులో పర్యటించి తాగునీటి సరఫరా, ఫిల్టరేషన్లను పరిశీలించి, సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. తొలుత మేయర్ తక్కెళ్లపాడు రోడ్‌లోని నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించి, తదుపరి సమ్మె చేస్తున్న కార్మికుల శిబిరంలోకి వెళ్లి, కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం

**సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్**



లక్ష్మీపురం: రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపిందని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. మంగళవారం గుంటూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పొగులగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన మంత్రి లోకేష్, ఇప్పుడు ఆ మీటర్లకు బిగించుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా బుధవారం ఉదయం 10.00 గంటలకు, గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పట్నంబజారు: వరకట్న వేధింపులతో వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడుకు చెందిన తాడిబోయిన శ్రీలత(22)తో పాత గుంటూరు యాదవ బజారులో నివాసం ఉండే వెంకట సాయికు 2022లో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంతో పాటు, పలు వస్తువులు ఇచ్చారు. వివాహం అయిన నాటి నుంచి అధిక కట్నం కావాలని శ్రీలతను భర్త వెంకట సాయి, అత్తమామలు, కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారు. సోమవారం రాత్రి శ్రీలత నివాసంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు శ్రీలతను భర్త వెంకట సాయి, అత్తమామలు హత్య చేశారని ఆరోపిస్తున్నారు. మృతురాలి సోదరుడు గోపిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికుల సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు

- నేటి నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలోకి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నగరపాలక సంస్థ ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మెకు మద్దతుగా మంగళవారం ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి తూర్పు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి జీతాలు పెంచకపోవటం అన్యాయమన్నారు. చాలీచాలని వేతనాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రకటనలు ఇస్తున్నటువంటి ప్రభుత్వం ఎందుకని సమస్య పరిష్కరించలేదని ప్రశ్నించారు. బుధవారం నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలోకి దిగుతున్నటువంటి నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని రౌండ్ టేబుల్ తీర్మానం చేసిందన్నారు. లేనిపక్షంలో పౌర సమాజంతో కలిసి సమ్మెకు మద్దతుగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టీ, జిల్లా అధ్యక్షులు షేక్ బాషా, మెడికల్ రిప్రజెంటివ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ సలీం, ఎల్ఐసీ సంఘం నాయకులు ఎం.రాజేశ్వరరావు, 108 అంబులెన్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎ.యశ్వంత్, కౌలు రైతు సంఘం నాయకులు బైరగాని శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి షేక్ ఖాసిం వలి, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ యూనియన్ నాయకులు ఆది నికల్సన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం నాయకులు షేక్ ఖాసిం షాహిద్ మద్దతు తెలిపారు.

## అర్చకుల బయోమెట్రిక్‌పై సానుకూల స్పందన



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేతలు

నగరంపాలెం: ఆలయాల్లో పనిచేసే అర్చకులకు బయోమెట్రిక్ విషయంపై గందరగోళం నెలకొందని అర్చక జేఏసీ రాష్ట్ర నాయకులు జంధ్యాల వేంకటరామలింగేశ్వరశాస్త్రి, ఏంఏ శేషాచార్యులు పేర్కొన్నారు. మంగళవారం గొల్లపూడిలోని దేవదాయ శాఖ కార్యాలయంలో కమిషనర్ రామచంద్రమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అర్చకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం బయోమెట్రిక్ మినహాయింపు విషయమై సడలింపు ఉత్తర్వులు జారీ చేశారని జేఏసీ నాయకులు తెలిపారు. అర్చకులకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. వేతన అర్చకులకు ట్రెజరీ జీతాలు అమలు చేసేందుకు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకెళ్తామని వివరించారు. జేఏసీ నాయకులు ఎంఏ శేషాచార్యులు, కె.కిరణ్‌కుమార్, కొత్తలంక మురళీకృష్ణ, నారాయణం వేణుగోపాల్, పి.జగన్మోహన్, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, ఆమంచి రవికుమార్, నందివెలుగు శేషగిరిరావు, బృందావనం గోపీచంద్, యనమదల ఆంజనేయులు, దీవి రఘురాం, చెంగోళం శేషాచార్యులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## దళిత యువకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



అంబేద్కర్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: టీడీపీ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరు దళిత యువకులకు రక్షణ కల్పించడంతో పాటు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసు నమోదు చేసి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చౌడవరం లలిత పీఠం సోమవారం రాత్రి టీడీపీ నాయకుడు గింజుపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన యనమదలకు చెందిన దళిత యువకులైన యమ్మల శరత్, యమ్మల రామస్వామిలను కులంపేరుతో దూషిస్తూ రాళ్లతో దాడి చేయడంతో ఒకరు గుంటూరులోని లలిత హాస్పిటల్‌లో, మరొకరు కాటూరి ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో శరత్ తండ్రి బాబు, దళిత సంఘాల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయన్నారు. దాడి జరిగిన ఘటన స్థలానికి ఇంత వరకు డీఎస్పీ, ఎస్పీ కాని వచ్చిన పరిశీలించకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఇంత జరుగుతుంటే కలెక్టర్ స్పందించకపోవడం దళితులంటే ఎంత చిన్న చూపో స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, బండ్లమూడి స్టాలిన్, బత్తుల అనిల కాంతారావు, మోపర్తి శ్రీను, చిన్న, శామ్యూల్, డి ప్రసాద్, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతమవుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరింది. సమ్మెకు మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వై.యశ్వంత్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ – వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ నగరంలో నీటి సమస్యకు కారణం ప్రభుత్వమేనని, వెంటనే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింప చేసే దిశలో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు.

**మేయర్ ప్రకటనపై కార్మికుల ఆగ్రహం**

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె విరమించినట్లు, విధులకు హాజరు అయినట్లుగా గుంటూరు నగర మేయర్ కె.రవీంద్ర అసత్య ప్రకటన చేయటాన్ని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ – వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఒక ప్రకటనలో ఖండించింది. అసత్య ప్రకటనలతో కార్మికులను గందరగోళానికి గురి చేసే ప్రకటన తప్ప మరొకటి కాదని, యూనియన్ జిల్లా ప్రధాన కార్యాలయం కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు నిర్దేశిత సమయానికి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.1.87 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిర్వహించే సమయంలో కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం, నిర్దేశిత సమయంలో, నాణ్యతా ప్రమాణాలు ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని కోరారు. ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు పనులు జరిగే సమయంలో పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో అభివృద్ధి పనుల నిర్వహణలో స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుంటామని, నగరాభివృద్ధికి ప్రజాప్రతినిధులందరిని కలుపుకు వెళతామని పేర్కొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ



నెహ్రూనగర్: మైనార్టీ సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. మంగళవారం గుంటూరు తూర్పు నియోజకవర్గం 54వ డివిజన్‌లో సుపరిపాలన మన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి ప్రభుత్వం నడుస్తోందని, అందుకే ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. కేవలం ఏడాది కాలంలోనే చెప్పిన పనులు చెప్పినట్లు అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వంలో ప్రథమ ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

**వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా**



పట్నంబజారు: ప్రజలను మోసం చేసిన చంద్రబాబు వంచన రాజకీయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో 5, 57 డివిజన్ అధ్యక్షులు, నేతలతో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్కానర్‌ను ఆవిష్కరించి ఏవిధంగా ఇంటింటికి ప్రచారం చేయాలనే అంశాన్ని పార్టీ నేతలకు సూచించారు. నూరిఫాతిమా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చి అమలు చేయకుండా ఏడాది పాలన గడిపారని మండి పడ్డారు. దీనిపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే స్పష్టమైన వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పారు. కచ్చితంగా రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి స్కానర్‌ను ప్రజలకు చూపించి బాబు ఇచ్చిన హామీలు, అమలు చేయని విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పసుపులేటి రామయ్య, వేణు పాల్గొన్నారు.

## విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

**డీఎస్పీ అరవింద్**



లక్ష్మీపురం: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కళాశాల వద్ద, నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మహాత్మాగాంధి కళాశాల, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాస్టర్ మైండ్స్ కళాశాల వద్ద కళాశాల, పాఠశాలల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ గత కొంత కాలంగా వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో కళాశాలలు, పాఠశాలల వద్ద పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత విద్యాసంస్థల నిర్వాహకులకు సూచించినట్లు చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు అయి ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కోరారు. అనంతరం వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు గంగావెంకటేశ్వర్లు, నజీర్ బేగ్, ఆరోగ్య రాజు, ఎస్ఐలు నరహరి, రాంబాబు, రామాంజనేయులు, తరంగిణీ పాల్గొన్నారు.